క్లుప్తంగా

ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలి


హెచ్ఎంలకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఎంఈఓలు రాజేంద్ర ప్రసాద్, గిరిజ తెలిపారు. శనివారం ఆముదాల, పాలసముద్రం హైస్కూళ్లలో ఉపాధ్యాయులకు సీఆర్సీ సమావేశం జరిగింది. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన బాధ్యత సంబంధిత హెచ్ఎంలపై ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్య, మంచి పౌష్టికాహారం, విద్యార్థులకు మౌలిక వసతులు ఉన్నాయని గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను పంపిస్తున్న తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్రతి తరగతిలో వెనుక బడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రంలో మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కరదీపికలు పంపిణీ


కరదీపిక అందజేస్తున్న ఎంఈఓ

విజయపురం: మండలంలోని 38, ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, 5 ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయలకు ఏఈఓ హరిప్రసాద్ చేతుల మీదుగా కరదీపికలు పంపిణీ చేశారు. శనివారం సీఆర్సీ సమావేశంలో అన్ని సబ్జెక్టులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ఉపాధ్యాయ కరదీపికలను అందజేశారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో కరదీపికలను ఉపయోగించి, బోధన కొనసాగించాలి పేర్కొన్నారు. హెచ్ఎంలు సుమతి, దొరస్వామి, జానకిరామిరెడ్డి, సురేష్ కుమార్, వెంకమరాజు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతో అధిక రాబడి


ఆయిల్ పామ్‌ను పరిశీలిస్తున్న పీడీ

నగరి: అంతర పంటల సాగుతో రైతుకు అధిక రాబడి వస్తుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జి.వాసు అన్నారు. ఆయన శనివారం మండలంలోని వేలావడి గ్రామంలో రైతు రామకృష్ణ పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆయిల్ పామ్ తోటలో నవధాన్యాల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు 30 రకాల విత్తనాలు 20 కేజీలు వేసుకోవడంతో భూసారం పెరుగుతుందని, రైతులందరూ ఈ విధంగా వేసుకోవాలన్నారు, ఇలా వేసుకుని విత్తనాలు తీసుకుని లాభం పొందవచ్చన్నారు. ఈ విధానంతో భూమిని 365 రోజులు కప్పి ఉంచవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ అధికారి గురు, మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్, మోడల్ మేకర్ సురేష్, సంపత్, మనోహర్ పాల్గొన్నారు.

నివాళి

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని జీడీ నెల్లూరు దళితవాడకు చెందిన పాల్‌రాజ్ (60) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసి శనివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి గ్రామానికి చేరుకుని పాల్‌రాజ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు గౌతమ్, విష్ణును ఓదార్చారు. వైస్ ఎంపీపీ హరిబాబు, నేతలు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పకుంటే మహిళలతో మహాధర్నా

- ఎమ్మెల్యే భానుకు పుత్తూరు వైఎస్సార్ సీపీ నాయకుల హెచ్చరిక


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుత్తూరు: మాజీ మంత్రి ఆర్కే రోజాను అసభ్యకరంగా మాట్లాడిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ క్షమాపణలు చెపాలని, లేనిపక్షంలో వేలాది మంది మహిళలతో కలిసి పుత్తూరులో మహాధర్నా నిర్వహిస్తామని పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడారు. హరి మాట్లాడుతూ పదేళ్లపాటు ప్రజాప్రతినిధిగా పనిచేసిన మహిళా మాజీ మంత్రి రోజమ్మను చెప్పలేని విధంగా దూషించిన మీరు సభ్యసమాజానికి ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. మహిళలను తూలనాడి సర్వనాశనం అయిపోయిన వారి గత చరిత్రలను గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నగరి నియోజకవర్గంలో ఎవరూ చేయనన్ని అభివృద్ధి పనులను గత పదేళ్లలో రోజమ్మ చేశారని తెలిపారు. సొంత ఖర్చులతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన మహోన్నత మహిళా నేతను అసభ్యకరంగా మాట్లాడడం మీ నీచ సంస్కృతిని తెలియజేస్తోందని దుయ్యబట్టారు. తక్షణం రోజమ్మకు క్షమాపణలు చెప్పి, చేసిన తప్పును సరిదిద్దుకోవాలని హితవు పలికారు.

ఏం సాధించాలని?

మహిళా నేత వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ మాట్లాడడం ద్వారా ఏం సాధించాలనుకున్నారని వైఎస్సార్‌సీపీ పుత్తూరు పట్టణ అధ్యక్షుడు కేసీ ఏకాంబరం ప్రశ్నించారు. నగరి నియోజకవర్గంలో రోజమ్మ చేసిన అభివృద్ధి, రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆమె చేసిన సేవా కార్యక్రమాలు ఇప్పటివరకు ఎవరూ చేసిన దాఖలాలు లేవన్నారు. రాజకీయాల్లో ఉక్కు మహిళగా పేరు తెచ్చుకున్న మహిళా మాజీ మంత్రిని దూషించడం దురదృష్టకరమన్నారు. స్త్రీ జాతిని నీచంగా మాట్లాడిన ఇలాంటి వ్యక్తిని గెలిపించామా? అన్న విషయాన్ని ప్రజలు సైతం ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

సభ్యసమాజం తలదించుకునేలా!

మాజీ మంత్రి రోజమ్మను నగరి ఎమ్మెల్యే భాను మాట్లాడిన తీరు సభ్యసమాజం తలదించుకొనేలా ఉందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం అన్నారు. స్త్రీలను గౌరవించలేని ఇలాంటి ఎమ్మెల్యేల గురించి రాష్ట్రంలోని ప్రతి మహిళా ఆలోచించాలని పిలుపునిచ్చారు. నగరిలో ఇలాంటి నీచ సంస్కృతి ఎన్నడూ లేదని, దీనికి తెరతీసిన భాను తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తక్షణం క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున మహిళలతో పుత్తూరులో ధర్నా నిర్వహిస్తామన్నారు. నాయకులు శంకర్, అన్నాలోకనాథం, కుట్టి, బాలాజీ, చక్రపాణి, మునిరత్నం, ఈశ్వరయ్యయాదవ్, చిరంజీవియాదవ్, మురళీరెడ్డి, దేవేంద్రరెడ్డి, గంగయ్యనాయుడు, భాస్కర్, మస్తాన్, కిషోర్, లక్ష్మణమూర్తి, గుణ, కేశవ పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం మన సంస్కృతి

మహిళలను గౌరవించడం మన దేశ సంస్కృతి అని, అయితే నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ నీచ సంస్కృతికి తెర తీశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి ఇ.చిరంజీవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను అమానుషంగా మాట్లాడడంతో శాసనసభ్యత్వానికే తీరని మచ్చన్నారు. చేసిన తప్పును క్షమాపణలు చెప్పడం ద్వారా సరిదిద్దుకోవాలని సూచించారు. లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు.

తిన్నింటివాసాలు లెక్కించే వారా రోజమ్మను విమర్శించేది


నింద్ర: మాట్లాడుతున్న పార్టీ నాయకులు

నింద్ర: ఏ పార్టీలో పదవులు అనుభవించారో ఆ పార్టీకే ద్రోహం చేసి, తిన్నింటివాసాలు లెక్కించిన మురళీరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఏలుమలైకు రోజమ్మను విమర్శించే అర్హతే లేదని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మాజీ మంత్రి ఆర్కే రోజాపై శనివారం మురళీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏలుమలై చేసిన విమర్శలపై వారు స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విమర్శలు చేసే వారిని చూస్తే తోలుబొమ్మలాట గుర్తుకు వస్తుందన్నారు. ఎవరో ఎక్కడో నూలు ఆడిస్తుంటే వీరు ఇక్కడ తైతక్కలాడుతుంటారన్నారు. వీరి కామెడీ షోలు అప్పుడప్పుడూ జరుగుతూనే ఉంటాయని, ఆ విషయం అందరికీ తెలిసిందే అన్నారు. సర్పంచ్‌గా ఓడిపోయిన మురళీరెడ్డి వైఎస్సార్ సీపీలో మాజీ మంత్రి చలువతో ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు అనుభవించారన్నారు. సొంత చిన్నాన్ననే వెన్నుపోటు పొడిచిన చరిత్ర భాస్కర్ రెడ్డిదన్నారు. పార్టీ పదవులు పొంది ఆ ముసుగులో అక్రమంగా సంపాదించుకున్న ఘనుడు ఏలుమలై (అములు) అన్నారు. వీరెంతటి ఘనులే మునుముందు ఎమ్మెల్యే గాలిప్రకాష్ కూడా తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, సర్పంచ్ బాబురెడ్డి, వైస్ ఎంపీపీ రాము, ఎంపీటీసీ సభ్యులు విజేష్, పార్టీ జిల్లా కార్యదర్శి అనిల్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మేరీ, పార్టీ నాయకులు మునికృష్ణారెడ్డి, చార్లీ, వీరయ్యనాయుడు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి


విజయపురం: మాట్లాడుతున్న నాయకులు

విజయపురం: ఎమ్మెల్యే భానుప్రకాష్ మాజీ మంత్రి ఆర్కే రోజాకు క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ సీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల పార్టీ కార్యాలయంలో మండల కనీ్వనర్ శివరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రి ఆర్కే రోజాపై నగరి ఎమ్మెల్యే భాను అనుచిత వాఖ్యలు చేయడం తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సినీ నటిగా ప్రజలకు ఎంతో దగ్గరగా ఉన్న మహిళా నాయకురాలు, నగరి నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోసం నిత్యం పోరాటం చేస్తున్నా తమ నాయకులు రోజాపై బాధ్యత కలిగిన ఎమ్మెల్యే వ్యక్తిగత దూషణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు గుణశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌నాయుడు, శేఖర్‌రాజు, చెంచురాఘవరాజు, జిల్లు, కుమార్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం నాయుడు, సురేష్, రమేష్, నాగరాజు, శ్రీరాములురెడ్డి, పాండియ్యన్, సతీష్ పాల్గొన్నారు.

ఆ వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలి

వడమాలపేట (విజయపురం): ప్రజా ప్రతినిధిగా బాధ్యతగా వహించాల్సిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మాజీ మంత్రి రోజాపై చేసిన అసభ్యకర వ్యాఖ్యన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన వాటిని వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్ సపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కాయం గాంధీ అన్నారు. భాను కంటే ముందుగా నగరి నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా ప్రజలకు సేవ చేసిన మహిళా నేతను అలా మాట్లాడడం సరికాదన్నారు.

వైఎస్సార్ కుటుంబానికి విధేయులమనే వేధింపులా?

- రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు
- మచ్చలేని మా నాన్న నారాయణస్వామిపై కక్ష సాధించేందుకు కుట్ర
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి ఫైర్


మీడియాతో మాట్లాడుతున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, అమాయకులైన వారిపై కేసులు బనాయిస్తున్నారని జీడీనెల్లూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కృపాలక్ష్మి అన్నారు. శనివారం ఆమె పుత్తూరులోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభిమానించే ప్రతి ఒక్కరిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అవినీతికి ఏమాత్రం తావు లేకుండా నీతి, నిజాయితీగా రాజకీయంలో ఎదిగిన తన తండ్రి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై బురద చల్లేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడైనా అన్యాయం జరిగితే డిప్యూటీ సీఎంగా ప్రజల పక్షాన పోరాడిన వ్యక్తి తన తండ్రి నారాయణస్వామి అని అన్నారు. కూటమి ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు అదిరేది లేదన్నారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే తనతండ్రిని కేసులో ఇరికించాలని సీఎం చంద్రబాబు చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజల కోసం పోరాడే క్రమంలో తాము ఎన్ని అక్రమ కేసులు బనాయించినా పోరాడతామని.. తన కుటుంబం వెనుకాడబోదని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా చివరకు గెలిచేది న్యాయమేనని ఆమె హితవు పలికారు.

సచివాలయాల నిర్వహణ అధ్వాన్నం


మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలు

పుత్తూరు: సచివాలయ వ్యవస్థ రోజు రోజుకు దిగజారుతోందని ఎంపీపీ మునివేలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మునివేలు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడంలేదన్నారు. దీంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉత్తరపుకండ్రిగ సంఘమిత్ర వైస్ సర్పంచ్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ తమ గ్రామంలోని డ్వాక్రా సంఘాలకు రుణాలు అందడం లేదని, ఇందుకు ఇక్కడి సంఘమిత్ర నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. గ్రూపు లీడర్లు ఎవరూ తన వద్దకు రావద్దని, వచ్చినా రుణాల గురించి మాట్లాడవద్దని ఆమె నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దీనిపై ఏపీఓ సమాధానం ఇస్తూ ఈ విషయమై పూర్తిస్థాయి విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సదాశివకోనకు వెళ్లడానికి సమీప ఎస్టీ కాలనీ వరకు ఆర్టీసీ బస్సు నడపాలన్న డిమాండ్ చేసినా ఏడాదైనా పరిష్కారం కాలేదని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల, ఇన్‌చార్జి ఎంపీడీఓ వాణి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

సారా రహిత సమాజమే లక్ష్యం

పాలసముద్రం: సారా రహిత సమాజంగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ శాఖ ఏఎస్ఎస్ఐటీ శ్రీనివాసాచారి, ఏసీబీ తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. శనివారం నరసింహపురంలో సారా తీసుకోవడం వల్ల వచ్చే అనర్థాలు, సారా తయారీ చేస్తే తీసుకునే చర్యలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. సారా కేసులు ఉన్న 10 మందిని బైండోవర్, ఒకటి పీడీ యాక్ట్ కేసులు పెట్టామన్నారు. అందువల్లచట్టానికి విరుద్ధంగా సారా తయారీ, విక్రయం చేస్తే చర్యలు తప్పదని హెచ్చరించారు. నరసింహపురంలో సారా తయారీ, విక్రయం మానుకోవాలని హెచ్చరించారు. జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఎక్సైజ్ శాఖ సీఐ శిరీషాదేవి, ఏఈఎస్ కృష్ణకిషోర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో

పుత్తూరు: స్థానిక ఏడీకే కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని మాజీ మంత్రి ఆర్కే రోజా నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రస్తుత వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించనున్నారు.

కాలభైరవుడికి వడమాల అలంకరణ


వడమాల అలంకరణలో కాలభైరవస్వామి

నగరి: కాలభైరవ స్వామిని శనివారం వడమాలతో అలంకరించారు. పట్టణంలోని కరకంఠేశ్వర స్వామి ఆలయంలోని కాలభైరవ స్వామి సన్నిధిలో విశేష అష్టమి సందర్భంగా శనివారం ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. పాలు, పంచామృతం, పన్నీరు, కొబ్బరినీరు, చందనం, కదంబం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అభిషేకానంతరం స్వామిని వడమాలలతో అలంకరించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విశ్వరూప దర్శనం చేసుకున్నారు. పాల్గొన్న మహిళలందరికీ పసుపు కొమ్ములు, విభూది, ప్రసాదాలు, వడలను ఆలయ నిర్వాహకులు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

ఇసుక అక్రమ డంప్ సీజ్


సీజ్ చేసిన ఇసుక

నింద్ర: మండలంలోని ఎంఎస్‌వీఎం పురంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను నింద్ర తహసీల్దార్ శేషగిరిరావు శనివారం సీజ్ చేశారు. ఇసుక ఎవరికి చెందినదన్న విషయం తెలియడం లేదని చెప్పారు. అక్రమంగా డంప్ చేసిన ఇసుక ఆరు ట్రిప్‌లు ఉండగా, దాన్ని ఎంపీడీఓ శివప్రసాద్ వర్మకు అప్పగించారు. ప్రభుత్వం చేపట్టే నిర్మాణ పనులకు వాడుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగం నిషేధించండి


మాట్లాడుతున్న కమిషనర్ మంజునాథ్‌గౌడ్

పుత్తూరు: ప్లాస్టిక్‌ను నిషేధించి, ప్రత్యామ్నాయాలను వినియోగించాలని మున్సిపల్ కమిషర్ ఎం.మంజునాథ్‌గౌడ్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కూరగాయల మార్కెట్ వ్యాపారులకు ఒకసారి మాత్రమే వినియోగించగల ప్లాస్టిక్‌పై తనిఖీలు చేసి, అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏఈ కార్తికేయన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కృష్ణ, ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. మొక్కలు నాటారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాసులు, బాబురావు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు తీవ్ర గాయం



రేణిగుంట: ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా తిరుపతి విమానాశ్రయం వద్ద శనివారం ఓ టీడీపీ కార్యకర్త గాయపడ్డాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి జిల్లా పర్యటన కోసం విమానాశ్రయానికి వస్తున్నాడన్న సమాచారంతో టీడీపీ నాయకుడు, వడమాల పేటకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వరరావు విమానాశ్రయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెలుపలకు వచ్చిన తర్వాత టర్మినల్ ఎదురుగా ఉన్న కాలువపై నడిచి వస్తుండగా కాలువపై ఉన్న బండ విరగడంతో ఆయన కాలువలో పడ్డాడు. ఈ ఘటనలో ఆయన కాలుకు బండ తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అధికారులు అతన్ని దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గిరిజన కుటుంబాలపైనా దాడులేమిటి?


చిరంజీవి

పుత్తూరు: గిరిజన కుటుంబాలపై దాడులేమిటని, మున్సిపాలిటీలోని వినాయకపురం ఎస్టీ కాలనీలో తుపాకుల రాజయ్య ఆటోకు నిప్పంటించి, కాల్చివేసింది టీడీపీ నాయకులేనని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.చిరంజీవి ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రశాంత గిరిజన గ్రామాల్లో సైతం అలజడి సృష్టించే కొత్త సంప్రదాయానికి కూటమి సర్కారు తెరతీసిందన్నారు. నగరి టీడీపీ ముఖ్య నాయకుడు ప్రోద్బలంతోనే ఈ చర్య జరిగిందన్నారు. అందుకే ఆటో కాల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు ఇచ్చి రెండు రోజులైనా ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. కేసును నీరుగార్చేలా పోలీసులు ఫిర్యాదుదారుడితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులైన గిరిజనులపైనా దాడులు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, బాధితుడికి న్యాయం చేయకపోతే జిల్లా ఎస్పీ, రాష్ట్ర ఎస్టీ కమిషన్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

ప్రైవేటు బస్సు ఢీకొని ఆంధ్ర కార్మికుడి మృతి

తిరుత్తణి: ప్రైవేటు బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఆంధ్రాకు చెందిన కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన శుక్రవారం రాత్రి తిరుత్తణిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ఆంధ్రా లోని నగరికి చెందిన బాలకృష్ణన్(45) సొంత పనుల నిమిత్తం నగరి నుంచి తిరుత్తణి మార్గంలో అరక్కోణంకు ద్విచక్రవాహనంలో వెళ్లారు. తిరుత్తణి సమీపం అరక్కోణం రోడ్డు మార్గంలోని వళ్లియమ్మపురం బస్టాపు వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ ప్రమాదం నుంచి తప్పించుకునే ప్రయత్నంలో బైకు అదుపుతప్పింది. ఈక్రమంలో ప్రయివేటు బస్సును ఢీకొనడంతో బాలకృష్ణన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 అంబులెన్స్‌లో తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ట్రాఫిక్ సమస్య పరిష్కరించారు. ఇంతలో చికిత్స పొందుతూ బాలకృష్ణన్ మృతి చెందాడు. తిరుత్తణి పోలీసులు కేసు నమోదు చేసి పరారైన బస్సు, వ్యాన్ డ్రైవర్ల కోసం గాలిస్తున్నారు. అరక్కోణం రోడ్డు మార్గంలో అతి వేగంగా వాహనాలు నడపడంతో తరుచూ వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు, వళ్లియమ్మపురం వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

పరిశుభ్రతను పాటిద్దాం..ఆరోగ్యంగా ఉందాం


నగరిలో మానవహారం

నగరి: పరిశుభ్రతను పాటిద్దాం.. ఆరోగ్యంగా ఉందాం అని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత పాటించాలంటూ ర్యాలీ నిర్వహించి, టవర్‌క్లాక్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పుగా మారే చెత్తకుప్పలను ఇంట్లో ఉంచుకోకూడదన్నారు. ప్రతి ఇంట్లో ఇతర వ్యర్థాల కన్నా ఎలక్ట్రానిక్ వ్యర్థాలే అధికంగా పేరుకుపోతున్నాయన్నారు. అందులో ఎక్కువగా కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు ఉంటున్నాయన్నారు. ఆ పరికరాల్లో వినియోగించే చిప్‌లు, సెమీ కండక్టర్లు పర్యావరణానికి హాని చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలైన పాత టీవీలు, పాడైన కంప్యూటర్లు, ల్యాప్ టాప్లు, సెల్‌ఫోన్లు, ఎయిర్ కూలర్లను తొలగించాలన్నారు. వాటిని ఎక్కడ పడితే అక్కడ పారవేయకుడదన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇంటి నుంచి వచ్చే చెత్తతో కలిపి ఇవ్వకూడదని, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కోసం పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లోనే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రవింద్రారెడ్డి, మేనేజర్ శేఖర్, రెవెన్యూ ఆఫీసర్ తారకరామ్, ఏఈలు నవీన్, హేమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, ఆర్ఐ జయశంకర్, పురపాలక సిబ్బంది, సచివాలయం సిబ్బంది, మెప్మా సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేద్దాం

కార్వేటినగరం: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. శనివారం మండల కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడమే లక్ష్యమన్నారు. తద్వారా స్వచ్ఛమైన వాతావరణంతో పాటు వ్యాధులు దూరమై ఆరోగ్యవంతమైన సమాజానికి దోహదపడతామన్నారు. అనంతరం మండల కార్యాలయం ఆవరణలో సిబ్బందితో కలసి పిచ్చిమొక్కలను తొలగించి కార్యాలయ ఆవరణలో ఫలసాయ మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఏఓ విద్యావతి, డిప్యూటీ ఎంపీడీఓ మధుసూదన్, పంచాయతీ ఈఓ నాగరత్నమ్మ, కార్యదర్శి సెల్వి, ఏపీఎం కవిత పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగానే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాల్సిన మన అందరిపై ఉందని ఎంపీడీఓ సతీష్, సర్పంచ్ అయ్యప్ప తెలిపారు. శనివారం పాలసముద్రం ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా పరిసరాల శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. భవనం పక్కన పెరిగిన చిన్న మొక్కలు, చెత్తచెదారాన్ని శుభ్రం చేశారు. ఎంపీడీఓ సతీష్ మాట్లాడుతూ మండలస్థాయి తమ సిబ్బందితో కలసి ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర దినంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించింది. అందువల్ల ఆ రోజు పరిసరాలను శుభ్రంగా చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మధు, ఐకేపీ ఏపీఎం కల్పల తరెడ్డి, ఏపీఓ మార్గరేట్, ఈసీ రామ్మూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంపురంలో..

కార్వేటినగరం: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కేవలం విద్యావ్యవస్థకే కాకుండా సమాజంలో అందరి ఆశయం కావాలని అప్పుడే అది సాధ్యమవుతుందని డీఎంపురం హెచ్ఎం నాదమునిరెడ్డి అన్నారు. శనివారం డీఎం పురం ఉన్నత పాఠశాల, కమ్యూనిటీ ఆరోగ్యకేంద్రం ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ స్వచ్ఛమైన వాతావరణం, ఆరోగ్యవంతమైన సమాజానికి మూలమని.. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వాళ్లని భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది


పాఠశాల ఆవరణలో చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

ప్రతి గ్రామాన్నీ పరిశుభ్రంగా ఉంచాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ

నింద్ర: మండలంలోని ప్రతి గ్రామాన్నీ పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పలు పంచాయతీల్లో పర్యటించి, స్వచ్ఛ భారత్ పనులను అయన పరిశీలించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. గ్రామాల్లో చెత్తను ప్రతి రోజూ తీసి వేసి శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, స్వచ్ఛభారత్ అధికారి అరుణాచలం పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గంగాధర నెల్లూరు : 95539 55610
నగరి : 95539 55609